క్లుప్తంగా

దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: పట్టణంలోని 12వ వార్డు ఉప్పరిపేట దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠలో శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నక్క జీవన్, అల్లాల సరిత, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బీరం రాజేష్, ప్రభాకర్‌రావు, రమణరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ ప్రజాపాలన విజయోత్సవాల కో ఆర్డినేటర్ బాస వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చేర్మెన్ పన్నాల అంజిరెడ్డి, మండల,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొంతం రాజం, తిరుమల గంగాధర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో సిబ్బందిని నియమించాలి



ఎస్ఈకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి : మండలంలోని దోనూర్ సబ్‌స్టేషన్‌లో సిబ్బందిని నియమించాలని శుక్రవారం ఎస్ఈ సాలియా నాయక్‌కు వినతిపత్రం అందించారు. సబ్‌స్టేషన్లో లైన్‌మెన్, ఆపరేటర్లు లేక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఎస్ఈకి వినతిప్రతం ఇవ్వాలని సూచించగా, వారు అందించారు. దీనికి సానుకూలంగా స్పందించి సిబ్బంది ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్ పాల్గొన్నారు.

ధర్మపురిలో స్పెషల్ డ్రైవ్

ధర్మపురి: పట్టణంలో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాస్ పట్టణంలోని 11,12 వార్డుల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను చేపట్టారు. వార్డుల్లో డ్రెయినేజీలు, చెత్తా చెదారాలు తొలగించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్ జక్కు పద్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ తదితరులున్నారు.

భూనిర్వాసితులకు రూ. 20 లక్షల పరిహారం ఇవ్వాలి


రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కథలాపూర్: సూరమ్మ ప్రాజెక్టు కుడికాలువలో భూమి కోల్పోతున్న పోసానిపేట గ్రామ రైతులకు ఎకరానికి రూ. 20 లక్షలు పరిహారం ఇవ్వాలని గ్రామస్తులు అధికారులను కోరారు. మండలం పోసానిపేటలో శుక్రవారం భూసేకరణపై గ్రామసభ నిర్వహించారు. ప్రాజెక్టు కుడికాలువ కోసం పోసానిపేట పరిధిలో 20.17 ఎకరాలు అవసరమని అధికారులు సర్వే నెంబర్ల వారీగా వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరానికి రూ. 20 లక్షలు పరిహారం ఇస్తేనే తమకు న్యాయం చేసినట్లవుతుందని, ప్రభుత్వం, అధికారులు సహకరించాలని పలువురు రైతులు విన్నవించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నాగేశ్, సర్వేయర్ రమేశ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

జగిత్యాల/జగిత్యాలరూరల్/కోరుట్ల/ధర్మపురి/ఇబ్రహీంపట్నం/రాయికల్/గొల్లపల్లి/మల్యాల/మల్లాపూర్/పెగడపల్లి/కథలాపూర్/సారంగాపూర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అధికారులు, దళిత సంఘాల నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతనిధులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నాయకులు


జగిత్యాలలో నివాళి అర్పిస్తున్న డీఎంహెచ్‌వో


వ్యవసాయ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకుల నివాళి,


కోరుట్లలో మాజీ ఎమ్మెల్యే..


నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి



ధర్మపురి, రాయికల్‌లో నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

'రైతుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్, బీజేపీలకు లేదు'

మల్లాపూర్: రైతుల సంక్షేమం గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్, బీజేపీలకు లేదని కిసాన్‌కాంగ్రెస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి అన్నారు. మల్లాపూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డితో కలిసి మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం ఎప్పుడూ పనిచేయని బీఆర్ఎస్, బీజేపీలు రైతు సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ నెరవేరుస్తుందన్నారు. సమావేశంలో నాయకులు మామిడి రాజశేఖర్‌రెడ్డి, ఇప్పపల్లి గణేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యంరెడ్డి

నేడు కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయ ప్రారంభోత్సవానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి కోరారు. అతిథిగా పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు వస్తున్నారని పేర్కొన్నారు.

పేద, మధ్య తరగతి వర్గాలకు న్యాయం చేయాలి


రిలే దీక్షలో ధర్మసమాజ్ పార్టీ ప్రతినిధులు

జగిత్యాలటౌన్: పేద, మధ్య తరగతి వర్గాలకు కనీస అవసరాలు కల్పించి న్యాయం చేయాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ శివ డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలకు విద్య, వైద్యం, ఉపాధి సాధన లక్ష్యంగా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ సమీపంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, అర్హతకు తగిన పని కల్పించాలని కోరారు. ప్రతీ నిరుపేదకు సొంత ఇంటి వసతి కల్పించి వారు ఆత్మగౌరవంతో బతికేలా చూడాలన్నారు. నాయకులు అరుణ్‌తేజ, నర్సయ్య ముదిరాజ్, ఉపేంద్ర, తిరుపతి, గంగరాజం తదితరులు పాల్గొన్నారు.

• వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇప్పించాలి

రాయికల్: వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇప్పించేలా శాసన మండలిలో సమస్య లేవనెత్తాలని వీఆర్ఏల వారసత్వ సంఘం నాయకులు నసీర్ శుక్రవారం ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం సమర్పించారు. వీఆర్ఏల వారసులకు విద్యార్హతలు బట్టి ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

• యాదవుల ఐక్యతే లక్ష్యం

మల్లాపూర్:యాదవులను చైతన్యపరిచి వారి ఐక్యతే లక్ష్యంగా అఖిల భారత యాదవ మహాసభ పనిచేస్తుందని ఆ సంఘం మండల అధ్యక్షుడు సంగ గంగరాజం అన్నారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా ఎట్టెం మల్లేశ్, ఉపాధ్యక్షులుగా పంచతి చిన్న మల్లయ్య(సాతారం), అరికెల గంగారెడ్డి(వేంపల్లి)లకు నియామక పత్రా అందజేశారు. కార్యక్రమంలో యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దనరేకుల సంతోష్‌యాదవ్, జిల్లా కార్యదర్శి వెంకటేష్, మండల ఉపాధ్యక్షుడు సతీష్, గౌరవ అధ్యక్షుడు రాజగంగారాజం, సభ్యులు పాల్గొన్నారు.

• యువతులకు సన్మానం

వెల్గటూర్ : మండల కేంద్రానికి చెందిన సిరిపురం సాత్విక సింగరేణిలో సివిల్ ఇంజనీర్‌గా, బండారి సాహితి గ్రూప్- 4 ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం వారిని సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేరుగు మురళి, సందీప్‌రెడ్డి, బందెల ఉదయ్, గంగ్ర శ్రీకాంత్‌రావు, జూపాక ప్రవీణ్, మెరుగు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

• ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం

కథలాపూర్: వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్‌గా నియమితులైన పులి శిరీషాను మండలంలోని పోతారం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరహరి, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ పులి హరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• రాష్ట్ర బంద్ జయప్రదం చేయాలి

కోరుట్ల: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన ఆటో,ట్యాక్సీ,వ్యాన్‌ల బంద్ జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుతారి రాములు,మౌలానా కోరారు. శుక్రవారం పట్టణంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

• పోస్టుమాస్టర్ ఉద్యోగ విరమణ

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లిలో బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా పనిచేసిన ఎండబెట్ల మాణిక్యం శుక్రవారం పదవీ విరమణ పొందగా, తోటి తపాలా ఉద్యోగులు మాణిక్యంను సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు కార్తీక్, శ్రీనివాస్, గోపి, చంద్రారెడ్డి, యూనియన్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, విజేందర్‌రావు, హేమెందర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ సురేందర్ పాల్గొన్నారు.

• సమీకృత వసతి గృహానికి చేరిన గురుకుల విద్యార్థులు

మల్యాల: మండల కేంద్రంలోని సమీకృత వసతి గృహానికి జగిత్యాల అర్బన్ గురుకుల పాఠశాలకు చెందిన 5,6,7,8 తరగతుల విద్యార్థులు చేరుకున్నారు. సమీకృత వసతి గృహంలో నిరుపయోగంగా ఉన్న రెండో అంతస్తులో జగిత్యాల అర్బన్ గురుకుల పాఠశాలకు చెందిన 45 మంది విద్యార్థులకు వసతి, తరగతి గదులను కేటాయించారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి జగిత్యాల గురుకుల కళాశాల నుంచి సామగ్రిని మల్యాలలోని సమీకృత వసతి గృహంలోకి తరలించారు.

• యూనిఫామ్స్ పంపిణీ

సారంగాపూర్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. రెండు జతల దుస్తులతో పాటు, డ్రాయింగ్ బుక్స్, టేబుల్స్, ఎల్‌కేజీ, యూకేజీకి పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ జమరీ, ఎంపీడీవో గంగాధర్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

•ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సంజీవ్

మల్యాల: మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా నలువాల సంజీవ్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడిగా మోతుకుల నర్సయ్య, అధికార ప్రతినిధిగా కట్కూరి దిలీప్, ప్రధాన కార్యదర్శులుగా గుడిసె రవి, ముప్పారపు రవి, సంయుక్త కార్యదర్శులుగా గంగాధర చిన్న గంగమల్లు, దొనకొండ వినయ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌కు సన్మానం

కథలాపూర్: ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలానికి వచ్చిన రాష్ట్ర కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిని శుక్రవారం ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, స్థానిక నాయకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం భూమారెడ్డి, పంబాల లక్ష్మణ్, లింగారావు, అశోక్, మల్లేశ్ పాల్గొన్నారు.

• బైక్ చోరీ

కథలాపూర్: మండలంలోని కలిగోట గ్రామంలో కొండ నవీన్‌కు చెందిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. నవీన్ గ్రామంలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి తన ఇంటిముందు బైక్‌ను నిలిపాడు. శుక్రవారం ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ధర్మపురిలో భారీ వర్షం

ధర్మపురి: పట్టణంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షంతో రోడ్లు నిండిపోయాయి. వర్షం కారణంగా రోడ్లపై జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యమయ్యాయి. వర్షపునీరు గుంతల్లో నిలిచి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

ఎమ్మెల్యేపై వెలమ నాయకుల ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న వెలమ సంఘం నాయకులు

జగిత్యాలక్రైం: వెలమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని జగిత్యాల వెలమ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం పట్టణ సీఐ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ ఒక బాధ్యత గల హోదాలో ఉండి వెల్మ సామాజిక వర్గాన్ని దూషించడం, అంతుచూస్తామని బెదిరించడం సరికాదన్నారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాగర్‌రావు, కిషన్‌రావు, సుధాకర్‌రావు, శ్రావణ్‌రావు, అజిత్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకపోవాలి

మెట్‌పల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకపోయి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు యూత్ కాంగ్రెస్ నాయకులకు సూచించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బీరం రాజేశ్‌తో పాటు పలువురిని శుక్రవారం కలిసి అభినందించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందేలా యూత్‌కాంగ్రెస్ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, వాకిట సత్యంరెడ్డి, రాజారెడ్డి, దీపక్‌రాజ్ తదితరులున్నారు.

జ్యోతక్క మృతి పట్ల దీపాదాస్ మున్షీ సంతాపం

మెట్‌పల్లి: మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క మృతి పట్ల ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ సంతాపం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జ్యోతక్క మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.


ఆస్తి వివాదంలో దాడి

మెట్‌పల్లి: పట్టణంలోని బర్కత్‌పురాకు చెందిన రషీద్ అనే యువకుడిపై గురువారం రాత్రి దాడి జరిగింది. బాధితుడి కథనం ప్రకారం..రషీద్‌కు అతడి సోదరుడితో కొంతకాలంగా ఆస్తి విషయంలో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో సోదరుడు కొందరితో కలిసి ఇంట్లో ఉన్న రషీద్‌పై కర్రలతో దాడి చేశారు. అడ్డువచ్చిన కుటుంబ సభ్యులను కూడా కొట్టి వెళ్లిపోయారు. ఈ ఘటనలో అతడికి తలతో పాటు పలు చోట్ల గాయాలు కాగా, ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

స్నేహితుడి స్కూటీ దహనం

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన బాలె కిరణ్ స్కూటీని అదే గ్రామానికి చెందిన తన స్నేహితుడు అరికెల నాగరాజు పెట్రోల్ పోసి దహనం చేశాడు. దీంతో కిరణ్ తండ్రి బాలె లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

పువ్వు తీసుకో.. హెల్మెట్ పెట్టుకో


వాహనదారుకు గులాబీపూలు ఇస్తున్న విద్యార్థులు

జగిత్యాలక్రైం: ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని యావర్‌రోడ్‌లో అవగాహన కల్పించారు. విద్యార్థుల చేత ద్విచక్ర వాహనదారులకు గులాబీ పూలు అందించి హెల్మెట్ పెట్టుకోవాలని విన్నవించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరారు. ద్విచక్రవాహనం నడిపే వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనానికి ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏఎస్సై సందాని తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలటౌన్: పట్టణంలోని యావర్‌రోడ్డులో టూవీలర్ల అమ్మకం దారులు రోడ్డుపై పదుల సంఖ్యలో టూవీలర్లను రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై పార్కింగ్ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. పార్కింగ్ స్థలాన్ని కన్సల్టెన్సీలు ఆక్రమించుకోవడంతో పలువురు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్‌కు కారణమవుతున్నారు. పార్కింగ్ స్థలాలను ఇష్టారాజ్యంగా ఆక్రమించి దందా చేస్తున్న టూవీలర్ కన్సల్టెన్సీలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ , జగిత్యాల సెల్ నంబర్: 9849905877

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొండగట్టు: ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని జేఏసీ నాయకులు హెచ్చరించారు. కొడిమ్యాల మండల కేంద్రంలో శుక్రవారం అంబేడ్కర్‌కు నివాళి అర్పించి మాట్లాడారు. సోదరుల్లాగా కలిసి ఉన్న మాల,మాదిగలను కొంత మంది స్వార్థ శక్తులు,వారి వ్యక్తిగత లాభం కోసం విడదీసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌కు మాలల మీద నిజమైన ప్రేమ ఉంటే, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు మంత్రివర్గంలో చోటు కల్పించడానికి కృషి చేయాలన్నారు.స్వార్థ రాజకీయాల కోసం వర్గీకరణను అడ్డుకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్, జేఏసీ నాయకులు సురుగు జగన్ ,పర్లపెల్లి ప్రసాద్,నర్సయ్య,సురుగు శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో మల్యాల యువకుల సత్తా

మల్యాల: యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో మల్యాల యూత్ కాంగ్రెస్ నాయకుల్లో సత్తా చాటారని యూత్ కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గం ఉపాధ్యక్షుడు వెల్మ కృష్ణారెడ్డి అన్నారు. మల్యాలలో శుక్రవారం మాట్లాడారు. మండలానికి చెందిన ముత్యం శంకర్ యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా, చొప్పదండి నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా వెల్మ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శ్రీకోటి శ్రీకాంత్ మండల అధ్యక్షుడిగా శనిగరం తిరుపతి, ఉపాధ్యక్షుడిగా నాగుల సంజీవ్ గౌడ్ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు

జగిత్యాల: తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సుద్దు అమృత సురేందర్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మేడిపల్లి: భీమారం మండలంలోని గోవిందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నగేష్, నవదీప్, రజిత, స్త్రీనాలు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీరామ్ నాయక్ ప్రకటించారు. ఎంపికైన విద్యార్థులు త్వరలోనే నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో పాల్గొంటారని పీఈటీ ప్రశాంత్ తెలిపారు.

విద్యార్థికి అభినందన

కథలాపూర్: మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థి బండి ఉదయ్‌కిరణ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనిత, పీడీ రవీందర్ తెలిపారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉదయ్‌కిరణ్ ప్రతిభ చాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని శుక్రవారం ఉపాధ్యాయులు, వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు బండి భాస్కర్ తదితరులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెగడపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో అకౌంటెంట్ పోస్టు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో సులోచన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం కామర్స్‌తో పాటు కంప్యూటర్ నాలెడ్జి ఉన్న మహిళలు ఇందుకు అర్హులని, ఆసక్తి గల మహిళలు స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఈ నెల 12 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

• 11న జాబ్ మేళా

పెగడపల్లి:నిరుద్యోగ యువత కోసం వివిధ రంగాల్లో ఉద్యోగవకశాలు కల్పించేందుకు ఈ నెల 11న జగిత్యాల జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో మేఘా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు పెగడపల్లి ఎస్సై రవికిరణ్ శుక్రవారం తెలిపారు. ఐటీ, మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్, ఫార్మా, మార్కెటింగ్, కోర్ టెక్నికల్ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర ప్రైవేటే సెక్టార్లలో సుమారు 50 రంగాల్లో అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఫార్మ, బీఫార్మతో పాటు ఏదైనాపీజీ, డిగ్రీ, ఇంటర్, టెన్త్, ఐటీఐ చదివిన వారు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి గల యువత పోలీస్‌శాఖ వారు విడుదల చేసిన బార్‌కోడ్‌ను స్కాన్ చేసి గూగుల్ ఫారం నింపి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ


వృథాగా పోతున్న నీరు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి శివారులో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అయి నీరు వృథాగా పోతోంది. ఇబ్రహీంపట్నం వెళ్లే రహదారిలో రైల్వే గేట్ సమీపంలో రహదారి పక్కనే ఈ లీకేజీ అవుతోంది. ఇక్కడి పైప్‌లైన్ తరచూ లీకేజీ అవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. లీకేజీ కాకుండా శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.